క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిస్తున్న దుర్గాదేవి

వీరఘట్టం: వీరఘట్టం పట్టణ ప్రజల ఇలవేల్పు శ్రీకోటదుర్గాదేవిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

సీతంపేటలో భారీ వర్షం

సీతంపేట: రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో ఆదివారం రాత్రి పలు చోట్ల ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గత కొద్దిరోజులుగా ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. ఖరీఫ్ పనులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

కొలతల మేరకు పనులు చేపట్టాలి

సీతానగరం: కొలతల ప్రకారం పనులు చేపడితేనే వేతనం గిట్టుబాటు అవుతుందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల్లో సోమవారం నుంచి శనివారం వరకు చేపట్టిన పనులు, గిట్టుబాటైన వేతనం, పని సామర్థ్యం, తదితర అంశాలపై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ, ప్రతి రోజూ 35 పంచాయతీలలో సుమారు 11,800 మందికి పని కల్పిస్తున్నామన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు కొలతలు వేసిన తర్వాతే పనులు చేయించాలని సూచించారు. వేతనదారులు సమయపాలన పాటించేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

నివాళులు..




సూర్యప్రకాష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం పురపాలక సంఘం 19వ వార్డు యర్రా కృష్ణమూర్తి కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చందక సూర్యప్రకాష్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన నివాసం వద్ద జరిగిన పెద్దకర్మకు ఎమ్మెల్యే జోగారావు, తదితరులు హాజరై నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోల సత్యనారాయణ, పల్లి భానుప్రకాష్, కౌన్సిలర్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రై డే రేపు

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ నెల నాలుగో తేదీన డ్రై డే నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ అధికారి వి. రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో జిల్లా పరిధిలో గల 53 ప్రభుత్వ మద్యం దుకాణాలు, ఎనిమిది రెస్టారెంట్ బార్లు, కల్లు దుకాణాలు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు డ్రై డే నిబంధనలను ప్రజలందరూ పాటించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు



పెదబోగిలి ఆర్బీకేలో వరి విత్తనాలు

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు ఏఓ ఎస్. అవినాష్ తెలిపారు. మండలంలోని పెదబోగిలి ఆర్‌బీకేలో నిల్వ ఉన్న వివిధ రకాల వరి విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తేలిక రకం విత్తనాలు వేయడం మంచిదన్నారు. ఇప్పటికే వెంకటాపురం, నీలకంఠాపురం, బూర్జ, ఆవాలవలస, లక్ష్మీపురం, బుడ్డిపేట, తామరఖండి గ్రామాల రైతులు వరి విత్తనాలు భద్రపరుచుకున్నారని తెలిపారు. అలాగే మండలంలోని 19 ఆర్‌బీకేల ద్వారా వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

విత్తనశుద్ధితో రైతుకు లబ్ధి

- పంట తొలిదశలో తెగుళ్ల వ్యాప్తికి అడ్డుకట్ట
- రసాయన మందుల కోసం చేసే ఖర్చు ఆదా



వరి ఆకుమడిని సిద్ధం చేస్తున్న రైతు (ఇన్‌సెట్) ఎన్.లక్ష్మీనారాయణ, సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త

సీతంపేట: విత్తనశుద్ధితో పంటలను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించొచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. తొలిదశలో పంటలకు ఆశించే రసం పీల్చే పురుగులు, ఇతరత్రా తెగుళ్లను సమర్థవంతంగా నివారించేందుకు రైతులు తప్పనిసరిగా విత్తనాలను శుద్ధిచేసి నాటుకోవాలని సూచించారు. దీని వల్ల పురుగుల మందుల కోసం చేసే ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు.

వివిధ పంటల్లో విత్తన శుద్ధి ఇలా..

- వరిలో అగ్గితెగులు, పొడతెగులు, కాండం కుళ్లతెగులు నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- వేరుశనగకు ఆశించే తామర పురుగులు, పీఎస్ఎన్‌డీ నివారణకు కిలో విత్తనానికి 2 ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్, మొదలుకుళ్లు, కాండంకుళ్లు తెగులు సోకకుండా కిలో విత్తనానికి 1 గ్రాము టిబుకొనజోల్ లేదంటే 3 గ్రాములు మాంకోజెబ్, వేరుపురుగు సోకకుండా కిలో విత్తనానికి 6 గ్రాముల క్లోరోఫైరిపాస్ మందులతో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- మొక్కజొన్నలో ఆకు ఎండు, తుప్పు తెగులు సోకకుండా కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరామ్ లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి పాటించాలి.
- జొన్నలో నల్ల కాండంకుళ్లు తెగులు, మొవ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- సజ్జలో ఎర్గాట్ తెగులు సోకకుండా 20 గ్రాముల ఉప్పునీటి ద్రావణంలో ముంచి ఆరబెట్టి విత్తుకోవాలి. లేదంటే కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- రాగిలో అగ్గితెగులు నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా 2 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- కొర్రకు ఆశించే అగ్గితెగులు నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా 2 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేయాలి. వెర్రికంకి తెగులు సోకకుండా 3 గ్రాముల మాంకోజెబ్ లేదా కాప్టాన్ లేదా మెటలాక్సిల్‌తో శుద్ధి చేసుకోవాలి.
- పెసర, మినుము పంటలు విత్తే ముందు 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరామ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. అలాగే రసంపీల్చే పురుగులు ఆశించకుండా కిలో విత్తనానికి 5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 5 గ్రాముల థయోమిథాక్సామ్‌తో శుద్ధి చేయాలి.
- ఉలవలో కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి పాటించాలి.
- నువ్వుల పంటలో కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ లేదా మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- కుసుమపంటకు ఆశించే అల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు, తుప్పు తెగులు, ఎండు తెగులు నివారణకు 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ లేదా 1 గ్రాము కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- పొద్దుతిరుగుడుకు ఆశించే అల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు నివారణకు కిలో విత్తనానికి 2 గ్రాముల క్వింటాల్(ఇప్రోడియోన్ 25 శాతం+ కార్బండిజమ్ 25 శాతం)తో విత్తనశుద్ధి చేసుకోవాలి. నెక్రోసిస్ వైరస్ తెగులు సోకకుండా 4 గ్రాముల థయోమెథాక్సామ్ లేదా 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌తో శుద్ధి చేసుకోవాలి.
- ఆముదం పంటను ఆశించే అల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు, మొలకకుళ్లు, వడలు తెగులు నివారణకు 3 గ్రాముల కార్బండిజమ్ లేదంటే 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- పత్తిని ఆశించే రసం పీల్చు పురుగుల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్‌తో శుద్ధి చేసుకోవాలి. అలాగే వేరుకుళ్లు తెగులు నివారణకు కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ లేదా 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి పాటించాలి.

హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవు

- డీఎస్పీ జీవీ కృష్ణారావు



కురుపాం: మాట్లాడుతున్న డీఎస్పీ జి.వి.కృష్ణారావు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు కోరారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలో 8 మండలాల్లో 11 పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 3,092 మందిపై బైండొవర్ కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. 59 మంది రౌడీషీట్ ఓపెన్ చేసి, వారిపై నిఘా పెట్టామన్నారు. పోలింగ్ రోజున వీరఘట్టం, భామిని మండలాల్లో జరిగిన చెదురు మదురు ఘటనలకు బాధ్యులైన 28 మందిపై ప్రత్యేక కేసులు నమోదు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు రోజున, ఆ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ఇదివరకే గుర్తించిన సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. పోలీసు సిబ్బంది గ్రామాల్లో కవాతులు, మాక్ డ్రిల్, కార్డన్ సెర్చ్, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతూ అనుమానితుల కదలికలపై నిఘా పెట్టారన్నారు. గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని, ప్రజలు, నాయకులు సంయమనంతో వ్యవహరించాలన్నారు. తుది ఫలితాలు వచ్చే వరకూ 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని గుర్తుచేశారు. కౌంటింగ్ సమయంలో, ముగిశాక ఎక్కడా ఘర్షణలు, అల్లర్లు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐలు, ఎస్సైలతో పాటు సిబ్బందితో పహారా చేపడుతున్నట్లు వివరించారు. ఏ పార్టీ గెలుపొందినా విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చేందుకు అనుమతించేది లేదన్నారు. పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో అమ్మకాలు చేయకూడదని, జూన్ 6వ తేది వరకూ ఎన్నికల కోడ్ కొనసాగుతుందన్నారు. లెక్కింపు రోజున శాఖా పరమైన ఆంక్షలు, నిబంధనలు అతిక్రమిస్తే రౌడీ షీట్లు తెరుస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు.

ర్యాలీలకు అనుమతి లేదు

పాలకొండ: ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత గెలిచిన పార్టీలు ర్యాలీలు చేసేందుకు అనుమతులు లేవని సీఐ చంద్రమౌళి తెలిపారు. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని వివరించారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

కురుపాం: ఈ నెల 6వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలు ఎటాంటి కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని, గుంపులుగా ఉండొద్దని డీఎస్పీ జి.వి.కృష్ణారావు, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని గౌడువీధిలో ఎన్నికల నిబంధలపై ఆదివారం అవగాహణ కల్పించారు. ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెలవడుతుండటంతో ఎటువంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీల నిర్వహణకు అనుమతి లేదన్నారు. జన సమూహంతో సభలు, సమావేశాలు నిర్వహించరాదని, బాణసంచా, టపాసులు కాల్చరాదని సూచించారు. వారి వెంట కురుపాం ఎస్సై షణ్ముఖరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చురుగ్గా దోమల నివారణ మందు పిచికారీ

సీతానగరం: మండల పరిధిలోని గ్రామాల్లో మూడు రోజులుగా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. పెదబోగిలి మేజర్ పంచాయతీలోని పెదబోగిలి, హడ్కోకాలనీ, సీతానగరంగూడెంలో ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మలాథియాన్ మందు పిచి కారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టామని, కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నామని చెప్పారు. అలాగే అప్పయ్యపేట, బుడ్డిపేట, సీతానగరం గ్రామాల్లో చురుగ్గా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చినబోగిలిలో సర్పంచ్ కురమాన రాధ ఆధ్వర్యంలో కార్యదర్శి మనోహర్ ప్రధా న వీధుల్లో పారిశుధ్య పనులు చేయించారు.

పంట మార్పిడితో ప్రయోజనం



ఖరీఫ్ దుక్కులు చేస్తున్న రైతు

- భూసారం వృద్ధి, చీడపీడల నివారణ
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పాలకొండ రూరల్: ఒకే పొలంలో ఒకే పంటను సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గుతాయి. పంటల్లో ఎదుగుదల ఉండదు. చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుంది. పంటల మార్పిడిని పాటించటం ద్వారా భూసారం పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని అంటున్నారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులు సమర్థవంతంగా వాడుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారం నష్టపోకుండా అధిక దిగుబడులు పొందవచ్చు. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయశాఖ అధికారి ఎన్ని వాహిని రైతులకు పలు సూచనలు చేశారు.

ఒకే పంట సాగుతో కలిగే నష్టాలు..

- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల ఆలోతు వరకు ఉన్న పోషకాలు మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట కూడా నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది.
- మార్కెట్ సమస్యలు ఎదురవుతాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే వరు వ్యవస్థ ఉన్న పంట, తక్కువ లోతుకు చొచ్చుకుపోయే వేరు వ్యవస్థ ఉన్న పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. వరి–అపరాలు, జొన్న–పత్తి వంటి పంటలు వరుసగా వేయటం మంచిది.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవటం మేలు. ఉదాహరణకు మొక్కజొన్న–అపరాలు.

నియోజకవర్గంలో సాగు వివరాలు		
మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లల్లో)	రైతులు
పాలకొండ	6,345	12,901
వీరఘట్టం	7,112	14,201
సీతంపేట	3,079	9,173
భామిని	3,778	7,549

పంట మార్పిడితో మంచి దిగుబడులు



రైతులు ఏటా ఒకే పంటను సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద అధికంగా వరి పంట తప్ప వేరే పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపటం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు పంటల మార్పిడి విధానం ఉత్తమమైనది. దీనిపై రైతులు అవగాహన పెంచుకోవాల్సిఉంది. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు ఒకసారి అనుభవంలోకి వస్తే ఈ విధానాన్ని రైతులు కొనసాగిస్తారు. దీనిపై క్షేత్రస్థాయిలో మా సిబ్బందికి విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

– ఎన్ని వాహిని,
మండల వ్యవసాయాధికారి, పాలకొండ

పంటల మార్పిడితో లాభాలు..

పంట మార్పిడి విధానం ద్వారా అనేక లాభాలు ఉన్నాయి. వీటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరిపంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తర్వాత అపరాలు, వేరుశనగ, సోయాచిక్కుడు తదితర పంటలు సాగు చేయడం వలన భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే సిలీంధ్రాల ఉధృతి తగ్గుతుంది. వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ సాగు వల్ల వాటి వేర్లలోని రైజోబియమ్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటాయి. వేర్లలో బుడుపులు మాదిరి ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు, భజనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం, ఇతర పూజలు చేపట్టారు. ఈ హోమం చేసిన వారికి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 3, 4, 5వ తేదీల్లో బిక్షాటన కార్యక్రమం చేపడతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత కిల్లాడ



ప్రైజ్‌మనీ, కప్ అందుకుంటున్న కిల్లాడ జట్టు సభ్యులు

సీతంపేట: గత కొద్ది రోజులుగా మండలంలోని కిల్లాడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో కిల్లాడ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా పెదరామ జట్టు నిలిచింది. విజేత జట్లకు నిర్వాహకులు ఆదివారం ట్రోఫీలను ప్రదానం చేశారు. కిల్లాడ టీమ్ కెప్టెన్ కిల్లక శివకుమార్‌కు రూ.22 వేలు నగదు బహుమతి, ట్రోఫీని యూత్ సభ్యులు, గ్రామపెద్దలు అందజేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన పెదరామ జట్టుకు రూ.13 వేలు ప్రైజ్‌మనీ అందించారు. ఈ టోర్నీలో మొత్తం 106 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై జగదీష్‌నాయుడు

సీతంపేట: మండలంలోని దేవనాపురంలో చంద్రమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై జగదీష్‌నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అందరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. టోర్నీలో పాల్గొనేందుకు మొత్తం 65 జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని యూత్ సభ్యులు తెలిపారు.

అడ్వెంచర్.. ఆనందం



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

సీతంపేట: స్థానిక అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు జలవిహార్‌లో బోటుషికారు చేశారు. వివిధ సాహస క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బంజీట్రంపోలిన్, హ్యాంగింగ్ బ్రిడ్జీ వంటివాటిపై సాహసాలు చేస్తూ ఆనందించారు.

చిత్రలేఖనం పోటీలు



బొమ్మలు వేస్తున్న చిన్నారులు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జి.మురళి కొద్దిరోజులుగా చిత్రలేఖనంపై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో వారు ఏం నేర్చుకున్నారో తెలుసుకునేందుకు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఉత్తమ చిత్రాలు గీచిన వారికి గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు బహుమతులు అందజేశారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షునిపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు టి.వి.దుర్గారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఓ మహిళను వెంబడిస్తూ వేధించినందుకు అతం మోహన్ అనే అతన్ని పిలిచి మందలించారని, అందుకు ప్రతీకారంగా సూరిబాబుపై అతం మోహన్, అతం ప్రసాద్, మరో వ్యక్తితో కలిసి మారణాయుధాలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిని సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పోలీసులు స్పందించి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు.

ఫారం 17సి ఎంతో కీలకం..

పార్వతీపురం: ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన ప్రతి కౌంటింగ్ ఏజెంట్ ఫారం–17సీ తమ వద్ద ఉంచుకోవాలి. ఎక్కడైనా అవకతవకలు జరిగి ఉంటే ఫారం –17సీ ద్వారా ఇట్టే గుర్తించవచ్చు. పోలింగ్ రోజు ప్రిసైడింగ్ అధికారి, రాజకీయ పార్టీల ఏజెంట్లు చేసిన సంతకాలు ఇందులో ఉంటాయి. ఏజెంట్లు సంతకాలు లేకపోతే ఏఓ అవకతవకలు జరిగాయని భావించవచ్చు. సంబంధిత పోలింగ్ కేంద్రంలో ఉపయోగించిన కంట్రోల్ యూనిట్ నంబర్‌ను ఈ ఫారంలో పొందుపరచి ఉంటారు. కౌంటింగ్ సమయంలో అదే నంబర్ కంట్రోల్ యూనిట్‌పై ఉందో, లేదో ఏజెంట్లు సరిచూసుకోవాలి. పోలింగ్ రోజున ఎక్కడైనా, ఏదైనా సమ స్య ఉత్పన్నమైతే కంట్రోల్ యూనిట్‌ను మా ర్పు చేసి ఉంటారు. ఈ విషయా న్ని కూడా పేర్కొంటూ మార్పు చేసిన కంట్రోల్ యూనిట్ నంబర్‌ను ఫారం–17సీ లో చూపుతారు. కౌంటింగ్‌లో ఆ నంబర్ మ్యాచ్ కాకపోతే వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారిని సంప్రదించాలి. పోలింగ్ రోజు నమోదైన ఓట్ల సంఖ్య ఫారం–17సీ లో ఉంటుంది. కౌంటింగ్‌లో కంట్రోల్ యూనిట్‌లో చూపుతున్న ఓట్ల సంఖ్య, ఫారం–17సీలో నమోదు చేసి ఓట్ల సంఖ్య సమానంగా ఉందో, లేదో చూసుకోవాలి. ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించిన తర్వాత ఈవీఎంలో నమోదైన ఓట్లను సీఆర్‌సీ (క్లోజ్ రిజల్ట్ క్లియర్) చేసిన తర్వాతే పోలింగ్ ప్రారంభించాలి. సీఆర్‌సీ చేయని సందర్భంలో మాక్ పోల్‌లో నమోదైన ఓటను వీవీ ప్యాట్ నుంచి వేరుచేసి సీల్డ్ కవరులో ఉంచిన వాటిని లెక్కించాలి. కంట్రోల్ యూనిట్‌పై ఉన్న అన్ని సీళ్లను ఫారం–17సీ నంబర్లతో సరిచూసుకోవాలి. రిజల్ట్ బటన్ నొక్కిన తర్వాత నోటాతో కలిపి పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్యను చూపుతుంది. నమోదైన ఓట్లు, 17సీలో ఉన్న ఓట్లు సమానంగా ఉండాలి. పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయం గంటలు, సెకండ్లతో సహ కంట్రోల్ యూనిట్ చూపుతుంది. దీన్ని ఏజెంట్లు సరిచూసుకోవాలి.